## క్లుప్తంగా

### ఈ నెల 10 నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక

గరుగుబిల్లి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పి.బాల ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో మళ్లీ కార్యక్రమ నిర్వహణకు సిద్ధమవుతున్నామన్నారు. ప్రజలు ఏ సమస్య పరిష్కారానికైనా ప్రజాసమస్యల పరిష్కార వేదికను సంప్రదించవచ్చన్నారు.

### ఈ నెల 15న వినియోగదారుల సదస్సు

గరుగుబిల్లి: అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15వ తేదీన వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు పి.సూర్యారావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖాధికారితో పాటు తూనికలు, కొలతల శాఖ అధికారులు, శానిటరీ అధికారులు హాజరుకానున్నారన్నారు.

### పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని పాలెం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాడింగి సోములు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆ గ్రామానికి శనివారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచమ్మ, పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

### సస్యరక్షణపై అవగాహన..



పాలవలసలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వెలుగు కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

భామిని: మండలంలోని పాలవలస, పోలవరం గిరిజన గ్రామాల్లో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సస్యరక్షణపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది మాట్లాడుతూ.. సంప్రదాయ విత్తనాల వల్ల భూసారం మెరుగుపడుతుందని చెప్పారు. అనంతరం విత్తనాల తయారీ, చిరుధాన్యాల సాగు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సిబ్బంది శ్రీక్రాంతి, గోపాలరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### వసతులు కల్పించరూ..



మౌలిక సదుపాయాలకు నోచుకోని జగనన్న కాలనీ

పాలకొండ రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండల పరిధి లుంబూరు గ్రామ సమీపంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అక్కడ దాదాపు 1,174 మంది అర్హులకు ఇళ్ల స్థలాలను నాటి ప్రభుత్వం కేటాయించింది. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, అప్పటి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి లబ్ధిదారులకు పట్టాలను కూడా అందించారు. అప్పట్లో కాలనీలో మట్టి రోడ్లు వేయడంతో పాటు ఇళ్లకు విద్యుత్ మీటర్లు కూడా ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో రూ. 80 లక్షల ఖర్చుతో సమీపంలో ఉన్న ఓని గెడ్డ నుంచి నీటిని అందించడంతో చురుగ్గా నిర్మాణాలు జరిగాయి. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో కాలనీపై నిర్లక్ష్యపు నీడలు అలముకుంటున్నాయి. అవసరమైన మౌలిక వసతుల కల్పనలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన రోడ్లు, పైప్‌లైన్లు పాడవుతున్నాయి. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## నేటి సమాజానికి స్ఫూర్తి..

# రేపటి సమాజానికి వెలుగు మహిళ!

అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల సేవలను గుర్తించడానికి, వారిని గౌరవించడానికి ఏటా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పలు సంస్థల్లో పనిచేసే మహిళా సిబ్బందిని సత్కరించారు. నేటి సమాజానికి స్ఫూర్తి, రేపటి సమాజానికి వెలుగు మహిళ అని, స్త్రీ గౌరవింపబడిన చోట అభివృద్ధి, సంక్షేమం ఉంటుందని వక్తలు ప్రశంసించారు. మహిళలపై లింగవివక్ష వద్దని, పురుషులతో సమానంగా వారిని చూస్తూ అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మహిళా సంరక్షణ చట్టాలు, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలు వివరించారు.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



జియ్యమ్మవలస: సత్యకైలాష్ స్కూల్‌లో మహిళా సిబ్బందిని సన్మానించిన దృశ్యం



గరుగుబిల్లి: తోటపల్లి ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను సన్మానిస్తున్న సీవి తిరుపతిరావు, నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్



భామిని: సన్మానం పొందిన మహిళా టీచర్లతో బత్తిలి ఎస్సై అనిల్‌కుమార్, వైస్‌చైర్మన్ మన్మధరావు



పాలకొండ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



గరుగుబిల్లి: ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మహిళా పోలీస్ హేమలత




వీరఘట్టం: మహిళా దినోత్సవం సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ చందక సత్యనారాయణ, కనోసా ఆస్పత్రి యాజమాన్యం



గరుగుబిల్లిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీలో ఎంపీపీ రామారావు, తదితరులు



గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవం జరుపుకుంటున్న సిబ్బంది




సీతంపేట సర్పంచ్ కళావతిని సన్మానిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి, తదితరులు

## వేసవి వ్యాధులతో

# తస్మాత్ జాగ్రత్త..

- ఎండలతో ప్రమాదమేనంటున్న వైద్యులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- టైఫాయిడ్, డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీతంపేట:

ఎండాకాలం వచ్చిందంటే కొన్ని రకాల వ్యాధులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తాయి. మునుపెన్నడూ లేని విధంగా మార్చిలో పగటి ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎండలో బయటకు వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వ్యాధులు కూడా అదే స్థాయిలో వ్యాపిస్తున్నాయి. ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. ముందస్తు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదమేనని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యమైన వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య నిపుణులు పలు సూచనలు చేశారు.



రోగులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రి

**టైఫాయిడ్...**

ఇది అపరిశుభ్ర నీరు, కలుషిత ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఆశిస్తుంది. అతి జ్వరం, అలసట, నిస్సత్తువ, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం టైఫాయిడ్ లక్షణాలు. అలాగే చర్మ సమస్యలు కూడా తెలెత్తుతాయి.

**జాగ్రత్తలు:** శుభ్రమైన మంచినీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. బయట దొరికే చిరుతిళ్లు పూర్తిగా మానేయాలి. వైద్యుడిని సంప్రదించి మందులు వాడాలి.

**అతిసార..**

అతిసార సోకిన వారికి నీళ్ల విరేచనాలు అవుతాయి. పిల్లలు, వృద్ధులకు చాలా ఇబ్బంది. సకాలంలో స్పందించకపోతే ప్రాణాలకే ప్రమాదం. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం, శరీరంలో నీటి శాతాన్ని కోల్పోవడం జరుగుతుంది.

**జాగ్రత్తలు:** నిల్వ ఉన్న ఆహారం, నీరు తీసుకోకూడదు. ఎలక్ట్రాల్ పౌడర్‌తో నీటి శాతం, లవణాలు పెంచుకోవచ్చు.

**మలేరియా..**

మలేరియా ఆడ అనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. మూడు దశల్లో వ్యాధి ప్రభావం చూపుతుంది. మొదటి దశలో అధిక చలి, తలనొప్పి, వాంతులు, జ్వరం ఉంటాయి. రెండోదశలో చర్మం వేడిగా, అధిక రక్త పోటు ఉంటుంది. మూడో దశలో చెమట పట్టడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**జాగ్రత్తలు:** వైద్యుడి సూచనల మేరకు ముందులు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రతలు పడాలి. మితాహారం మంచిది.

**చికెన్ ఫాక్స్ (ఆటలమ్మ)...**

కోడిపై ఉండే మచ్చల మాదిరిగానే మన శరీరంపై నల్లని మచ్చలు వస్తాయి. ఈ వ్యాధి కలిగించే వైరస్‌కు వేసవికాలం అనుకూలంగా ఉంటుంది. ఇది అంటువ్యాధి. శరీరం తీవ్ర జ్వరంతో ఉంటుంది. అలసట, ఒంటిపై బుడగలు తేలడం, తలనొప్పి, దురద, ఆకలి తగ్గడం దీని లక్షణాలు.

**జాగ్రత్తలు:** వ్యాధి తగ్గడానికి కనీసం పది రోజుల సమయం పడుతుంది. వ్యాధిగ్రస్తులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. వీరి నుంచి ఇంకొకరికి సోక కుండా దూరంగా ఉంచడం మంచిది.

**మీజిల్స్..**

ఇది ఎక్కువగా ఎండాకాలంలోనే చిన్న పిల్లలకు వస్తుంది. పారామిక్స్ వైరస్ కారణంగా వ్యాధి సంక్రమిస్తుంది. దీని వల్ల గొంతు వెనుకభాగంలో ఒక పొరలా ఏర్పడుతుంది. తీవ్రమైన జ్వరం దగ్గు, జలుబు, గొంతు నొప్పి, కళ్లు ఎర్రబడడం, నడుటిపై ఎర్రని మచ్చలు వస్తాయి.

**జాగ్రత్తలు:** వైద్యుడి సలహాలతో ముందులు వాడాలి. వ్యాధి సోకిన వారి నుంచి పిల్లలకు దూరంగా ఉంచాలి. ముందస్తుగా వ్యాక్సిన్ వేయించడం మంచిది.

**జాండీస్ (పచ్చకామెర్లు)...**

నీటి కలుషితం వల్ల పచ్చ కామెర్లు వస్తాయి. దీన్ని హెపటైటిస్–ఎ అంటారు. చర్మం పచ్చ బడడం, మూత్రం పచ్చ బడడం, చర్మంపై దురద, ఆకలి మందగించడం, జ్వరం, ఒళ్లు నొప్పులు తెల్లని మలం రావడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

**జాగ్రత్తలు:** శుభ్రమైన నీటిని తాగాలి. నూనె వినియోగం బాగా తగ్గించాలి.

**డెంగీ..**


ఇదో రకమైన విష జ్వరం. దోమకాటు మూలంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి రెండు దశల్లో ఉంటుంది. అధిక జ్వరం, తల, కళ్లు, కండరాలు, కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటాయి.

**జాగ్రతలు:** పగటి పూట కుట్టే దోమల నుంచి జాగ్రత్తలు పాటించాలి. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు పెరిగే ప్రదేశాలను నిరోధించాలి.

**గవద బిల్లలు..**

వైరస్ కారణంగా గవద బిళ్లలు వస్తాయి. లాలాజలం గ్రంధులకు వాపు రావడం, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అలసట, ఆకలి లేకపోవడం ఈ వ్యాధి లక్షణాలు.

**జాగ్రత్తలు:** ఈ వ్యాధికి ముందస్తుగా ఎంఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది.





**వడదెబ్బ..**

ఎండలు పెరగడంతో శరీరం ఉష్ణోగ్రతను నియంత్రించుకోలేని స్థితికి చేరుతుంది. శరీరంలోని ఎలక్ట్రోలైట్స్, మినరల్స్, నీటి శాతం తగ్గి సత్తువలేని స్థితికి చేరడమే ఎండ దెబ్బ. శరీర ఉష్ణోగ్రత పెరగ డం, చెమట పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, కండరాలు గట్టిపడడం, చర్మం ఎర్రగా మారడం, వాంతి వచ్చినట్టు ఉండడం లేదా వాంతి చేసుకోవడం, మూర్ఛ రావడం, తలనొప్పి, కోమాలోకి వెళ్లడం లాంటి లక్షణాలు వడదెబ్బ సోకిన వారిలో కనిపిస్తాయి.

**జాగ్రత్తలు:** వడదెబ్బ సోకిన వారికి వైద్యుల సలహాతో మందులు వాడాలి. రోజుకు 10 నుంచి 15 గ్లాసుల నీరు తాగాలి. పండ్లు, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు, చెరుకు రసాలు ఎక్కువగా తీసుకోవాలి. తెల్లటి దుస్తులు ధరించడం శ్రేయస్కరం. మసాలాలు, కారం, నూనె, ఫాస్ట్‌ఫుడ్, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి.

### అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో వచ్చే వ్యాధులపై ముందస్తు అప్రమత్తం అవసరం. వీటి నుంచి ఉపశమనం పొందడానికి నీటిని ఎక్కువగా తాగాలి. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. సబ్‌సెంటర్ స్థాయిలో జింక్ ట్యాబ్లెట్లు కూడా ఇస్తున్నాం. అవి తీసుకుంటే మంచిది.

–సత్యవేణి, డాక్టర్, మర్రిపాడు పీహెచ్‌సీ

### అందుబాటులో మందులు..



అన్నిరకాల వ్యాధులకూ సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా ఉన్నాయి. ప్రజలు ఎండల్లో తిరగకుండా జాగ్రత్త పడితే మంచిది. ఈ సీజన్‌లో వ్యాధులు రాకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

–కె.విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సీతంపేట

### నిబంధనలు తప్పనిసరి..



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జి.కళాధర్

వీరఘట్టం: వాహనదారులు కచ్చితంగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్సై జి. కళాధర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని సీఎస్‌సీ రోడ్డులో యు. వెంకమ్మపేట వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు.

### జీసీసీ ద్వారా చింతపండు కొనుగోలు

గుమ్మలక్ష్మీపురం: జీసీసీ ద్వారా గిరి శిఖర గ్రామాల్లో చింతపండు కొనుగోలు చేస్తున్నట్లు జీసీసీ మేనేజర్ వి.కృష్ణప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం చింతపండు కొనుగోలు చేయగా, కిలో రూ.36 చొప్పున మొత్తం 40 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేశామని ఆయన అన్నారు. గిరిజన రైతులు నష్టపోకుండా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎవరూ కూడా దళారులకు అమ్మవద్దన్నారు.

### ఉపాధి పనులు కల్పించండి

జియ్యమ్మవలస: దళితులకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. మండల కేంద్రంలోని దళితవాడలో శనివారం పర్యటించిన ఆయన.. అక్కడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో రెండు వారాలుగా తమకు ఉపాధి పనులు కల్పించడం లేదని వారు వాపోయారు. స్పందించిన ఆయన.. తక్షణమే దళితులకు ఉపాధి పనులు కల్పించి, ఆదుకోవాలని కోరారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు ప్రజాసమస్యలపై అధ్యయనం కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దళితవాడ ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించాలని, శ్మశానవాటికకు స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు నీలకంఠాపురం పంచాయతీ పీసా కమిటీ ఉపాధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, కార్యదర్శి బిడ్డిక రామారావు తెలిపారు. శనివారం కురుపాం మండలంలోని నీలకంఠాపురంలో సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నీలకంఠాపురం పంచాయతీతో పాటు సరికొండ, కేదారిలంక, సల్లింగి, సందిగూడ గ్రామాలకు రోడ్లు కల్పించాలని తీర్మానం చేశారు. అలాగే నాయుడుగూడ, పెదగూడ గ్రామాల్లోని పాఠశాలల ప్రహరీ నిర్మాణ పనులు గ్రామస్తుల అనుమతి లేకుండా బయట వ్యక్తులు వచ్చి పనులు చేయడంపై కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పథకాల అమలు తీరు పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొరడ గ్రామంలో నాబార్డు సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో జీవ ప్రాజెక్టు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందుతున్న వివిధ పథకాల అమలు తీరును భారత నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఎస్ఎస్ఎఫ్ఐ) డైరెక్టర్ వెంకటేశ్వర్లు తన బృందంతో కలిసి శనివారం పరిశీలించారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న పథకాలు నిజంగా నిరుపేదలైన లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అనే విషయం తనిఖీ చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.




గిరిజన రైతులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ఐ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

### ఎండిపోయిన చెరువు



పాలకొండ మండలంలోని పీఆర్.రాజపేట – వెలగవాడ గ్రామాల మధ్యనున్న నరసింహ చెరువు పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఇరుగ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మూగజీవాల దాహార్తిని తీర్చడానికి గ్రామస్తులు కష్టపడాల్సి వస్తోంది. ఇరిగేషన్ అధికారులు తోటపల్లి ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల చేసినా కేవలం ఆ ప్రవాహం 7వ బ్రాంచ్ పరిధిలో నవగాం గ్రామం వరకు వచ్చి నిలిపోయింది. అధికారులు స్పందించి చెరువుకు నీరు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. –పాలకొండ రూరల్

### 300 ఏళ్లనాటి మహావృక్షం..



వీరఘట్టం మండలంలోని పనసనందివాడలో ఉన్న ఊడల మర్రిచెట్టుకు సుమారు 300 ఏళ్ల నాటి చరిత్ర ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామదేవత చెవిటమ్మ తల్లి చెట్టుగా ఈ మహావృక్షాన్ని కొలుస్తుంటారు. ఇటువంటి వృక్షం పరిసర ప్రాంతాల్లో లేనందున చెట్టును కాపాడుకుంటున్నామని గ్రామస్తులు తెలిపారు. – వీరఘట్టం

### రారెత్తిస్తున్న ఎండలు..



గడిచిన కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. రోడ్ల పక్క చిరువ్యాపారాలు దుకాణాలు మూసేస్తున్నారు. శనివారం 38 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదు కావడంతో పాటు వేడి గాలులు వీయడంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే పాలకొండ – శ్రీకాకుళం, సీతంపేట రహదారులు జన సంచారం లేక వెలవెలబోయాయి. – పాలకొండ రూరల్